పరిసరాల శుభ్రతతో మెరుగైన ఆరోగ్యం

- ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా వైద్యుల సూచన
- ర్యాలీలు, కరపత్రాల ద్వారా డెంగ్యూ, మలేరియా వ్యాధులపై ప్రజలకు అవగాహన


ఎన్జీజీవోస్ కాలనీలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య ఆరోగ్య సిబ్బంది

సీతంపేట: ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా నియోజకవర్గం పరిధిలోని అన్ని పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో పని చేస్తున్న వైద్య సిబ్బంది ర్యాలీలు, కరపత్రాల పంపిణీ ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రపంచ మలేరియా డే 2023 సందర్భంగా వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ 'మలేరియా సున్నా సాధన, ఆవిష్కరణ, అమలు' థీమ్‌తో మలేరియా నియంత్రణకు కృషి చేయాలని పిలుపునిచ్చింది.

అక్కయ్యపాలెంలో...
స్థానిక ఎన్జీజీవోస్ కాలనీలో గల విద్యుత్‌నగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సుధీర్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారానికి ఒకరోజు డ్రై డే పాటించడం ద్వారా దోమల వృద్ధిని నియంత్రించవచ్చన్నారు. అనంతరం ఆరోగ్య కేంద్రం నుంచి ఎన్జీజీవోస్ కాలనీలో పలు ప్రాంతాల్లో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో హెల్త్ సెక్రటరీలు ఎం.కమల, భాగ్యలక్ష్మి, రామయ్యమ్మ, వైసీహెచ్ రాణి, రామలక్ష్మి, నజ్మా, బేగం, తంబది, జగదీష్‌కుమారి, హెల్త్ అసిస్టెంట్ కోట్ని శ్రీనివాసరావు, ట్యాబ్ టెక్నీషియన్ కామరాజు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

నరసింహనగర్‌లో...
స్థానిక నరసింహనగర్ యూపీహెచ్‌సీ వైద్యురాలు ప్రశాంతి ఆధ్వర్యంలో శ్రీనివాసనగర్, నందగిరి నగర్‌లలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. దోమల నియంత్రణకు, జ్వరాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించి కరపత్రాలు పంచారు. హెల్త్ సెక్రటరీలు జి.నాగలక్ష్మి, రాజేశ్వరి, ధనలక్ష్మి, ఆర్.లక్ష్మి, ఉషాకిరణ్, కల్పన, వెంకటలక్ష్మి, హెల్త్ అసిస్టెంట్ కోట్ని శ్రీనివాసరావు పాల్గొన్నారు.

53వ వార్డులో..
మర్రిపాలెం: జీవీఎంసీ 53వ వార్డు మర్రిపాలెం శివనగర్‌లోని డాక్టర్ వైఎస్ఆర్ పట్టణ ఆరోగ్య కేంద్రంలో మంగళవారం శానిటరీ ఇన్‌స్పెక్టర్ డాక్టర్ పి.తిరుమల తులసి, మలేరియా సూపర్‌వైజర్ బీవీ లక్ష్మీ కుమారి సిబ్బందితో కలిసి అవగాహన కార్యక్రమం చేపట్టారు. అనంతరం హెల్త్ సెక్రటరీలు, శానిటేషన్, ఎన్విరాన్మెంట్ సెక్రటరీలు కలిసి ఎఫ్‌సీఐ పార్కు వరకు ర్యాలీ నిర్వహించారు. ఏఎన్ఎంలు, స్టాఫ్ నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్, ఆశ వర్కర్లు, మలేరియా, యూపీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

బాలికల ఐటీఐలో..
కంచరపాలెం: ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ కేంద్రం (బాలికల ఐటీఐ)లో వరల్డ్ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం మలేరియాపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా జిల్లా ఇండియన్ మెడికల్ అసోసియేషన్ కోశాధికారి డాక్టర్ ఎంవీవీ మురళీమోహన్ పాల్గొని మాట్లాడారు. ముందుగా విద్యార్థులకు మలేరియాపై వ్యాసరచన పోటీ నిర్వహించి విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఏడీ ప్రసాద్, ఐటీఐ సిబ్బంది పాల్గొన్నారు.

దోమల నివారణతో వ్యాధులు దూరం
సీతమ్మధార: దొండపర్తి అర్బన్ హెల్త్ సెంటర్ పరిధిలో జిల్లా మలేరియా ఆధ్వర్యంలో దొండపర్తి వీధుల్లో ర్యాలీ చేపట్టారు. యూపీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఎన్.ఎస్.కార్తీక్ మాట్లాడుతూ దోమల ఉత్పత్తిని నివారించాలన్నారు. జిల్లా మలేరియా విభాగం హెల్త్‌అసిస్టెంట్ ఎల్.శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు. ఇంటింటికీ కరపత్రాలు పంపిణీ చేశారు.

భవానీగార్డెన్స్‌లో..
కంచరపాలెం: జీవీఎంసీ 54వ వార్డు ఐటీఐ జంక్షన్ భవానీగార్డెన్స్‌లో యూపీహెచ్‌సీ వైద్య సిబ్బంది మలేరియాపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ముందుగా వైద్యాధికారి డాక్టర్ ప్రసాద్, డాక్టర్ ఏఎల్ సతీష్ అవగాహన ర్యాలీని ప్రారంభించారు.

విద్యార్థులకు బహుమతులు
మురళీనగర్: ప్రపంచ మలేరియా నిర్మూలనా దినోత్సవాన్ని పురస్కరించుకుని మాధవధార జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నిర్వహించిన చిత్రలేఖనం, వ్యాసరచన పోటీల్లో విజేతలకు మంగళవారం బహుమతులు అందించారు. జిల్లా మలేరియా విభాగం జిల్లా నోడల్ ఆఫీసరు నాగశ్రీను విద్యార్థులకు బహుమతులు అందజేశారు. పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం విక్టర్, ఉపాధ్యాయిని భవానీ రాణి, స్థానిక నోడల్ పర్సన్ లోకనాథం, మలేరియా ఇన్‌స్పెక్టరు ఎన్.శ్రీనివాసరావు, హెల్త్ అసిస్టెంట్ ఎం.కృష్ణమోహన్, నాగరాజు, జీవీఎంసీ హెల్త్ అసిస్టెంటు చౌదరి తదితరులు పాల్గొన్నారు.


దొండపర్తి అర్బన్ హెల్త్ సెంటర్‌లో ప్రపంచ మలేరియా దినోత్సవ ర్యాలీ


శివనగర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బంది


విజేతలకు బహుమతులు అందజేస్తున్న డాక్టర్ మురళీమోహన్


ర్యాలీలో పాల్గొన్న వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లు

క్లుప్తంగా

స్టేషన్ వద్ద స్టాపర్ల ఏర్పాటు


స్టాపర్లను పరిశీలిస్తున్న సీఐ శ్రీనివాసరావు

సీతమ్మధార : నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్ వద్ద స్టాపర్లతో పాటు స్టేషన్‌కు బోర్డు ఏర్పాటు చేశారు. స్టేషన్‌కు వచ్చే వారు ప్రధాన గేటు వద్ద ద్విచక్ర వాహనాలు నిలిపివేస్తుండడంతో కొత్తగా స్టాపర్లు ఏర్పాటు చేశారు. అలాగే స్టేషన్‌కు కొత్త బోర్డులు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు. సీఐ శ్రీనివాసరావు వీటిని పర్యవేక్షించారు.

బుల్లయ్య కళాశాలకు పతకాల పంట


విజేతలతో కరస్పాండెంట్ మధుకుమార్

సీతంపేట: ఈనెల 22, 23 తేదీల్లో ఆంధ్రా యూనివర్సిటీలో జరిగిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్, జూనియర్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో బులయ్య కళాశాల విద్యార్థులు పతకాలు సాధించారు. సబ్ జూనియర్ విభాగంలో బీఎస్సీ విద్యార్థి ఎన్.కుముందుని రజతపతకం, ఇంటర్ విద్యార్థి వి.జస్వంత్ బంగారు పతకం సాధించారు. జూనియర్ విభాగంలో ఎస్.జ్యోతి బంగారు, బి. అనిల్‌కుమార్ బంగారు, బి.లక్ష్మిసాయి రజతం, సీహెచ్ అజయ్ బంగారు పతకం సాధించారు. ఎంబీఏ మొదటి సంవత్సరం విద్యార్థి బి.అనిల్‌కుమార్ 83 కిలోల విభాగంలో ఆంధ్రప్రదేశ్ స్ట్రాంగ్ మెన్ టైటిల్ కైవసం చేసుకున్నాడు. ఈ సందర్భంగా పతకాలు సాధించిన విజేతలను కళాశాల కరస్పాండెంట్ జి. మధుకుమార్ అభినందించారు.

ఘనంగా రామానుజాచార్య జయంతి

మురళీనగర్: మురళీనగర్ పరిసర ప్రాంతాల్లో భగవత్ రామానుజాచార్య జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. కప్పరాడ ఎన్జీజీవోస్ కాలనీలోని వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయంలో రామానుజాచార్యకు పూజల అనంతరం పంచామృతాభిషేకం నిర్వహించారు. సాయంత్రం 6గంటలకు తిరువీధి మహోత్సవం నిర్వహించారు. పట్టాభిరెడ్డి తోటలోని వానప్రస్థ వృద్ధాశ్రమంలో నిర్వాహకుడు రొబ్బి శ్రీనివాస్ ఆధ్వర్యంలో రామానుజాచార్యునికి పూజలు చేశారు. ఆచార్యుల వారి బోధనలను ఆయన వివరించారు. మురళీనగర్ సెక్టార్-3లోని ప్రశాంతి ఆధ్యాత్మిక పార్కులో రామానుజాచార్యుని పాలరాతి విగ్రహం వద్ద పూజలు చేశారు.

వేడుకగా సింగమాంబ ఓడ ఊరేగింపు


పూజల్లో పాల్గొన్న కంపా హనోకు తదితరులు

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 45వ వార్డు పరిధి సింగాలమ్మపురం గ్రామ దేవత సింగమాంబ పండగ మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాలలో భాగంగా మంగళవారం ఉదయం అమ్మవారి ఓడ ఊరేగింపు కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన వార్డు కార్పొరేటర్, జీవీఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కంపా హనోకు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. మే 1వ తేదీన తొలేళ్లు, 2న ప్రధాన పండగ నిర్వహిస్తున్నట్లు ఆలయ అధ్యక్షుడు సీహెచ్ అప్పలరాజు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ సెక్రటరీ బి. చిన్నా, కోశాధికారి డి. ఆనంద్‌కుమార్, ఇతర కమిటీ సభ్యులతో పాటు 45వ వార్డు అధ్యక్షుడు పైడిరమణ, వైఎస్సార్‌సీపీ నాయకులు హరిపట్నాయక్, సన్యాసప్పలనాయుడు, నేపాల్‌శ్రీను, కారుకొండ రాజు, సన్నీ, నానిబాబు, సింగంపల్లి రామారావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కుంచమాంబ జాతర


కుంచమాంబను దర్శించుకుంటున్న గ్రామ కమిటీ సభ్యులు

కంచరపాలెం: మర్రిపాలెం ప్రజల ఆరాధ్య దేవత, కోర్కెలు తీర్చే కల్పవల్లిగా పేరొందిన కుంచమాంబ అమ్మవారి జాతరను గౌరీ సేవా సంఘం ఆధ్వర్యంలో మంగళవారం వైభవంగా నిర్వహించారు. గ్రామ కమిటీ సభ్యులు ప్రత్యేక పూజల అనంతరం దర్శనాలు ప్రారంభించారు. ఆలయ ప్రధాన అర్చకుడు శర్మ ప్రత్యేక కుంకుమ పూజలు చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

అట్టహాసంగా తిరువీధి
సాయంత్రం అమ్మవారి ప్రతిమలతో గౌరీ సేవా సంఘం వద్ద గల మూలవిరాట్ నుంచి తిరువీధి మహోత్సవం అట్టహాసంగా నిర్వహించారు. సుమారు 25 ఘటాలను ఆలయానికి చేర్చారు. కోలాటాలు, తప్పెటగుళ్లు, చిడతలు, వివిధ నేలవేషాలు, నడుమ అమ్మవారిని ఊరేగించారు. రాత్రికి అనుపోత్సవం ఘనంగా నిర్వహించారు. ఐదో పట్టణ పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

చెట్టు తొలగింపు

సాక్షి ఎఫెక్ట్..

సీతమ్మధార : పోర్టుటౌన్ పోలీస్‌స్టేషన్‌లో కూలిపోయిన చెట్టును తొలగించారు. ఈ నెల 21న 'కూలిన వృక్షం.. తప్పిన ప్రమాదం'శీర్షికన సాక్షి దినపత్రికలో వార్త వెలువడిన సంగతి తెలిసిందే. దీంతో మంగళవారం పోర్టుటౌన్ సీఐ శ్రీనివాసరావు పర్యవేక్షణలో కూలిపోయిన చెట్టును తొలిగించారు.

కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి


ధర్నాలో నినాదాలు చేస్తున్న ఏపీ జేఏసీ (అమరావతి) నాయకులు

మహారాణిపేట : కాంట్రాక్ట్ ఉద్యోగులు గత 20 సంత్సరాలుగా రెగ్యులర్ కాకుండా ఉన్నారని ఏపీ ఉద్యోగ సంఘాల జేఏసీ జిల్లా చైర్మన్ సత్తి నాగేశ్వర రెడ్డి అన్నారు.మంగళవారం సంఘాల కార్యాచరణ సమితి జిల్లా శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ సమీపంలోని ఎన్జీవో హోంలో ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా ఎన్జీవో సంఘం అధ్యక్షుడు కె.ఈశ్వరరావు, కార్యదర్శి రవిశంకర్, సిటీ కార్యదర్శి సత్యనారాయణ, ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎస్ఏ త్రినాథరావు, అమరావతి కో చైర్మన్లు ఎ. శ్రీనివాసరావు, నమ్మి శ్రీనివాసరావు, కార్యదర్శి మహేష్, కాంట్రాక్ట్ అండ్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగ సంఘం నాయకుడు వి. వీరబ్రహ్మం, కాంట్రాక్ట్ అండ్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

జీవీఎంసీ కమిషనర్‌ను కలిసిన కేకే రాజు


కమిషనర్ సాయికాంత్‌వర్మతో మాట్లాడుతున్న కేకే రాజు

సీతమ్మధార : ఇటీవల జీవీఎంసీ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన సాయికాంత్ వర్మను వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త, నెడ్‌క్యాప్ చైర్మన్ కేకే రాజు మర్యాదపూర్వకంగా కలిశారు.

కార్పొరేటర్లతో కలిసి వెళ్లిన ఆయన, నియోజకవర్గంలోని పలు అభివృద్ధి కార్యక్రమాలపై కమిషనర్‌తో చర్చించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, ఫ్లోర్ లీడర్ బానాల శ్రీనివాసరావు, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కంపా హనోక్, అల్లు శంకరరావు, స్టాండింగ్ కమిటీ మెంబర్లు సారిపల్లి గోవింద్, బర్కత్ ఆలీ, కార్పొరేటర్లు సాడి పద్మారెడ్డి, అల్ల లీలావతి, పి.ఉషశ్రీ, కె. కామేశ్వరి, వి.ప్రసాద్, రెయ్యి వెంకటరమణ, చల్లా రజని, శశికళ, కో-ఆప్షన్ సభ్యుడు సేనాపతి అప్పారావు, వార్డు అధ్యక్షులు పాల్గొన్నారు.

శ్రీశ్రీపై క్విజ్ పోటీలు


క్విజ్ పోటీలో పాల్గొన్న సాహితీవేత్తలు, యువత

సీతంపేట: శ్రీశ్రీ జయంతి సందర్భంగా విశాఖ రసజ్ఞ వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ జి. రఘురామారావు ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో శ్రీశ్రీ జీవితం, సమగ్ర సాహిత్యంపై క్విజ్ పోటీ నిర్వహించారు. ఇందులో 25 మంది పాల్గొన్నారు. 50 ప్రశ్నలు, వంద మార్కులకు వన్ వర్డ్ ఆన్సర్స్ రూపంలో పరీక్ష జరిగింది. ఈ పోటీల విజేతలకు జూనియర్, సీనియర్ విభాగాలకు వేర్వేరుగా ఈనెల 30న అంకోశాలో జరగనున్న శ్రీశ్రీ జయంతి వేడుకల్లో బహుమతులు అందజేస్తామన్నారు. రెండు విభాగాలకు విడివిడిగా ప్రథమ బహుమతి రూ.1000, ద్వితీయ బహుమతి రూ.750 నగదు బహుమతులు ప్రదానం చేస్తామని తెలిపారు. ఈ పోటీలను డాక్టర్ డీవీ సూర్యారావు, మేడా మస్తాన్‌రెడ్డి పర్యవేక్షించారు.

23 మందిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసు


జ్ఞానాపురం బ్రిడ్జి వద్ద తనిఖీలు చేస్తున్న సీఐ మళ్ళ అప్పారావు, సిబ్బంది

మర్రిపాలెం: మద్యం తాగి వాహనాలు నడిపిన 23 మందిని మంగళవారం మెజిస్ట్రేట్ ముందు హాజరు పరిచామని, వారికి రూ.53 వేలు జరిమానా విధించారని కంచరపాలెం ట్రాఫిక్ సీఐ మళ్ళ అప్పారావు తెలిపారు. కంచరపాలెంమెట్టు, తాటిచెట్లపాలెం, ఊర్వశిజంక్షన్, బిర్లా, ఎన్ఎస్‌టీఎల్, జ్ఞానాపురం కూడళ్లలో మద్యం సేవించి వాహనాలు నడుపుతున్నవారిని పట్టుకోవడం కోసం మూడు రోజుల నుండి ప్రత్యేక నిఘా పెట్టి డ్రైవ్‌లు చేశామన్నారు. ఎస్ఐలు పాపారావు, వాసుదేవరావు, ఉల్‌హక్ ప్రత్యేకంగా నిర్వహించిన తనిఖీల్లో 23 మంది పట్టుబడ్డారని ఆయన తెలిపారు. పట్టుబడ్డ ద్విచక్రవాహనాలు, ఆటోలు, కార్లు, లారీలను సీజ్ చేసి కోర్టుకు తరలించామని తెలిపారు.

సర్వీసు రోడ్డులో ఇరుక్కున్న కంటెయినర్


సర్వీసు రోడ్డులో ఇరుక్కుపోయిన భారీ వాహనం

మర్రిపాలెం: బిర్లా జంక్షన్ ప్రాంతంలోని ఓ షోరూమ్‌కు సంబంధించిన కంటెయినర్ మంగళవారం బిర్లా జంక్షన్ సర్వీసు రోడ్డు వద్ద మలుపు తిరుగుతున్న క్రమంలో మధ్యలో ఇరుక్కుంది. దీంతో దాదాపు గంటసేపు ట్రాఫిక్‌లో ఇరుక్కుపోవడంతో, వాహనదారులు ఇబ్బంది పడ్డారు. తరచూ ఇదే పరిస్థితి ఎదురవుతోందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బిర్లా, పంజాబ్ హోటల్ సర్వీసు రోడ్డులో పలు కంపెనీలకు చెందిన కార్ల షోరూంలు ఉండడంతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి వస్తున్న భారీ వాహనాలు ఆయా షోరూంల ఎదుట పార్క్ చేసి రోజుల తరబడి వదిలేస్తున్నారు. అలాగే తరచూ ఆ షోరూంలకు భారీ వాహనాలు వస్తున్న క్రమంలో ఆ ప్రాంతంలో పెద్ద ఎత్తున ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోందని వాహనచోదకులు ఆరోపిస్తున్నారు. దీనిపై ట్రాఫిక్ పోలీసులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా జరిమానాలు విధించి వదిలేస్తున్నారని అసహనం వ్యక్తం చేశారు. ట్రాఫిక్ పోలీసులు స్పందించి, సర్వీసు రోడ్డులో భారీ వాహనాలు నిలపకుండా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

చలివేంద్రం ఏర్పాటు


జవహర్‌లాల్‌నగర్‌లో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న గంకల అప్పారావు

కంచరపాలెం: కంచరపాలెం జవహర్‌లాల్‌నగర్ కొండవాలు ప్రాంతాల్లో గ్రామ కమిటీ సభ్యులు ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మంగళవారం వార్డు బీజేపీ సీనియర్ నాయకుడు గంకల అప్పారావు ప్రారంభించారు. వేసవి దాహార్తి తీర్చేందుకు చలివేంద్రాన్ని గ్రామ కమిటీ సభ్యులు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. అనంతరం చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో హరి, ఈశ్వరరావు, శ్రీను, గౌరీ నూకరాజు, పావని, అనూష, శ్రావణి, ప్రసన్న, సింహాద్రి, శేఖర్, ఎల్లాజీ, మురళీ, సతీష్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో తనిఖీలు


కేటరింగ్ స్టాల్‌ను పరిశీలిస్తున్న అధికారులు

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో మంగళవారం అధికారులతో కలిసి స్టేషన్ డైరెక్టర్ కె.వెంకటరాజు తనిఖీలు చేపట్టారు. అన్ని ప్లాట్‌ఫాంలలోని స్టాళ్లు, పరిసరాల పరిశుభ్రత, కేటరింగ్ సిబ్బంది పని తీరు, మంచినీటి కుళాయిలు పరిశీలించారు. స్టేషన్ మేనేజర్ ఎ.అరుణశ్రీ, గ్యారేజ్ అండ్ వేగన్, ఇంజనీరింగ్, కమర్షియల్ అధికారులు పాల్గొన్నారు.

ఆర్‌పీఎఫ్ సిబ్బందికి అవగాహన


సెమినార్‌లో మాట్లాడుతున్న డాక్టర్ చల్లా కృష్ణవీర్ అభిషేక్

తాటిచెట్లపాలెం: ఈస్ట్‌కోస్ట్ రైల్వే, వాల్తేర్ డివిజన్, రైల్వే భద్రతా దళం (ఆర్పీఎఫ్) సిబ్బందికి రైల్ క్లబ్‌లో సాఫ్ట్ స్కిల్స్‌పై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎథిక్స్ ఎడ్యుకేటర్, సాఫ్ట్ స్కిల్స్ నిపుణుడు డాక్టర్ చల్లా కృష్ణవీర్ అభిషేక్ మాట్లాడుతూ ఎటువంటి ఒత్తిడి లేకుండా విధులు నిర్వహించడంలో సాఫ్ట్‌స్కిల్స్ ఉపయోగపడతాయన్నారు. ఆర్పీఎఫ్ సీనియర్ డివిజనల్ సెక్యూరిటీ కమిషనర్ చొక్కా రఘువీర్ మాట్లాడుతూ ఆర్పీఎఫ్ సిబ్బందిలో ఆత్మస్థైర్యం నింపేందుకు, పని తీరు మెరుగుపరిచేందుకు ఇటువంటి సెమినార్లు నిర్వహిస్తున్నామన్నారు.

ప్రజా శ్రేయస్సే ప్రభుత్వ లక్ష్యం


మహిళకు కరపత్రం అందిస్తున్న కేకే రాజు, కటుమూరి సతీష్ తదితరులు


మర్రిపాలెం: ప్రజా శ్రేయస్సు కోసమే ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి పాటు పడుతున్నారని వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త, రాష్ట్ర నెడ్‌క్యాప్ చైర్మన్ కేకే రాజు అన్నారు. 49వ వార్డులో మంగళవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా బర్మాక్యాంప్ కాలనీ 282 సచివాలయం పట్టాభిరెడ్డి గార్డెన్స్‌లో డిప్యూటీ ఫ్లోర్‌లీడర్, వార్డు కార్పొరేటర్ అల్లు శంకరరావుతో కలిసి ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ ఫలాలను వివరించారు. ప్రజలందరి సహకారం, దీవెనలతో వచ్చే ఎన్నికల్లో మళ్లీ సీఎంగా జగనే కొనసాగుతారని అన్నారు. డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, ఫ్లోర్‌లీడర్ బానాల శ్రీనివాసరావు, కార్పొరేటర్ సాడి పద్మారెడ్డి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కిరణ్‌రాజు, యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి ఎం.సునీల్, వార్డు ఇన్‌చార్జి నీలి రవి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ఇన్సూరెన్స్ ఏజెంట్ల నూతన కార్యవర్గం


నూతన అధ్యక్షుడు మోహనరావు

సీతంపేట: జనరల్ ఇన్సూరెన్స్ ఏజెంట్స్ ఫెడరేషన్ ఇంటిగ్రేటెడ్ విశాఖపట్నం రీజియన్‌కు అధ్యక్షుడిగా సాలూరు మోహనరావు, సెక్రటరీగా సాయిరామ్, కోశాధికారిగా కృష్ణమోహన్, సహాధ్యక్షుడిగా పాపయరాజు, సంయుక్త కార్యదర్శిగా చంద్రరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గురుద్వార కూడలి వద్ద గల సంస్థ కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఉత్తరాంధ్ర, ఉమ్మడి గోదావరి జిల్లాల నుంచి ఏజెంట్లు పెద్ద సంఖ్యలో పాల్గొని కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ కార్యవర్గం 2026 వరకు పని చేస్తుందని, ఏజెంట్ల సమస్యల పరిష్కారానికి కమిటీ కృషి చేస్తుందని నూతన అధ్యక్షుడు మోహనరావు తెలిపారు. కొత్త కార్యవర్గ సభ్యులను పలువురు అభినందించారు.

ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసిన డీఎంహెచ్‌వో


విద్యుత్‌నగర్ పట్టణ ఆరోగ్య కేంద్రంలో రికార్డులు తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట: విద్యుత్ నగర్ పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా.పి.జగదీశ్వరరావు మంగళవారం సందర్శించారు. రికార్డులను పరిశీలించి, వైద్యాధికారితో, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. సమయపాలన పాటించాలని, విధులు సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. ఎన్‌సీడీ సర్వే, గర్భిణులకు ప్రత్యేక వైద్య సేవలపై సూచనలు చేశారు. ఆస్పత్రిలో సాధారణ ప్రసవాలు అయ్యేలా ప్రోత్సహించాలని సూచించారు. శస్త్ర చికిత్స ప్రసవాలను తగ్గించాలని, ప్రజలకు ఈ విధంగా అవగాహన కల్పించాలని ఆదేశించారు. వైద్యాధికారులు, ఆరోగ్య సిబ్బంది డ్రెస్ కోడ్ పాటించాలన్నారు. కార్యక్రమంలో డా.ఎన్.రమారెడ్డి, డా.బదరీనాథ్, శశిభూషణ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రచారం


గత ప్రమాదాలను చూస్తున్న ప్రజలు

మర్రిపాలెం: రోడ్డు ప్రమాదాల నివారణ చర్యల్లో భాగంగా కంచరపాలెం ట్రాఫిక్ పోలీసులు సుప్ర వాహనాల ద్వారా ప్రచారం చేపట్టారు. ఈ నేపథ్యంలో మర్రిపాలెం జంక్షన్ వద్ద రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించినట్టు ట్రాఫిక్ సీఐ మళ్ళ అప్పారావు తెలిపారు. మంగళవారం సాయంత్రం మర్రిపాలెం కూడలిలో గత ప్రమాదాలను ప్రదర్శిస్తూ జాగ్రత్తలు సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే వచ్చే నష్టం ఎలా ఉంటుందో తెలిపారు.హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని తెలిపారు.